సాక్షి
నిజామాబాద్
మంగళవారం | 30 | మే | 2023



పెరుగుతున్న పసుపు ధర

రైతుల వద్ద పసుపు నిల్వలు తగ్గిన తర్వాత ధర పెరుగుతోంది. క్వింటాల్‌కు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ధర పెరిగింది.

- 8లో ▸



వేగంగా పునర్విభజన

జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ పునర్విభజన ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇందు కోసం అధికారులు భవనాలను సిద్ధం చేస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.9 /29.4

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆమ్‌చూర్@ రూ.36,100



సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆమ్‌చూర్ ధర రూ. 36,100 పలికింది. సోమవారం మార్కెట్‌కు 812 క్వింటాళ్ల వరకు పంటను రైతులు తీసుకొచ్చారు. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధరగా నమోదైంది. నిజామాబాద్ మార్కెట్‌కు ఇతర జిల్లాల నుంచి రైతులు ఆమ్‌చూర్‌ను తీసుకొస్తారు. తెలంగాణలో కేవలం రెండు, మూడు మార్కెట్లలో మాత్రమే ఆమ్‌చూర్ క్రయవిక్రయాలు జరుగుతాయి. అందులో నిజామాబాద్ పెద్ద మార్కెట్. నాణ్యమైన సరుకు తీసుకొస్తే ఈ సీజన్‌లో ధర మరింత పెరిగే అవకాశముందని వ్యాపారస్తులు భావిస్తున్నారు.

అమరవీరుడి కుటుంబానికి న్యాయం చేయాలి



సుభాష్‌నగర్:సిరికొండకు చెందిన అల్లీపురం శ్రీనివాస్(చాకలి శ్రీనివాస్) తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని శ్రీనివాస్ భార్య అల్లీపురం సునీత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పిల్లలతో శ్రీనివాస్ భార్య సోమ వారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ తన భర్త శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో కేసీఆర్, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు పరామర్శించి, అంత్యక్రియలకు హాజరయ్యారని తెలిపారు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి అమరవీరుల కుటుంబానికి ప్రభుత్వపరంగా అందించే సహాయ సహకారాలతో పాటు ఉద్యోగం, పథకాలు అందజేసి ఆదుకోవాలని ఆమె కోరారు. సునీత వెంట కుమారుడు నవదీప్, కుమార్తె తేజ, తదితరులున్నారు.

చేపల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): వేసవి ఎండలు మండిపోతున్న నేపథ్యంలో జిల్లాలోని చెరువుల్లో చేపల పెంపకంలో మత్స్యకారులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్య శాఖ ఏడీ రాజనర్సయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల చెరువుల్లో నీరు తగ్గిపోయి చేపల సాంద్రత పెరుగుతుందని, గడ్డి ఎక్కువై ప్రాణ వాయువు తగ్గి చేపలు మరణించే అవకాశం ఉందన్నారు. అందుకే చెరువుల్లో నీటి నాణ్య త, లోతు, నీటి విస్తీర్ణం, చేపల కదలికలు రోజు గమనించాలని సూచించారు. చేపల్లో పెరుగుదల, రంగు, తోక, రెక్కల స్వభావం, మొప్పల రంగు లక్షణలను పరిశీలించాల న్నారు. ఏమైనా తేడా కనిపిస్తే వెంటనే మత్స్యశాఖ అధికారులకు సమాచారమిస్తే నివారణ చర్యలు చేపడతామన్నారు. ఆక్సిజన్ కొరత ఉంటే చేపలు బయటికి వచ్చి నోరు తెరుచుకుని ఉంటాయని, ఇలాంటి సమయంలో కొత్తనీరు పెట్టడం లేదా చేపలను పట్టి విక్రయించాలని సూచించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ చెంతకు ఆక్రమణల ఫైల్

సాక్షి ఎఫెక్ట్

నిజామాబాద్‌నాగారం: పులాంగ్ వాగు స్థలంలో యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతుండడంపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన 'యథేచ్ఛగా ఆక్రమణలు' కథనానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. విచారణ చేపట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించారు. గతంలో కూడా 'సాక్షి'లో పులాంగ్ వాగు కబ్జాకు గురవుతుందని కథనాలు వచ్చాయి. ఈ నెల 19న సుదర్శన్ అనే వ్యక్తి తన భూమి కబ్జా చేశారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యా దు చేశారు. 'సాక్షి'లో కథనాలతో పాటు, ఫిర్యాదు రావడంపై మున్సిపల్ కమిషనర్ సీరియస్‌గా స్పందించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించారు. వారం రోజుల వ్యవధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేయనున్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లి..

ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో నిజామాబాద్ నార్త్ తహసీల్దార్, సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్సై, అగ్నిమాపకశాఖ ఏరియా అధికారి, టీపీవోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారణ చేయనున్నారు. భూమి ఎంత మేర కబ్జా చేశారో తేల్చాల్సి ఉంది.

ఛీ..ఛీ.. చిల్లర పంచాయితీ!

తెలంగాణ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ కుర్చీ కోసం ప్రొఫెసర్లు యాదగిరి, కనకయ్య మధ్య వాదులాట గల్లీ లొల్లిని తలపించింది. ఇది చాలదన్నట్లుగా వీరికి మద్దతుగా విద్యార్థి సంఘాలు రెండుగా చీలిపోవడం.. పైగా బయట నుంచి దళిత సంఘాలు వర్సిటీలోకి రావడం మరీ విడ్డూరంగా మారింది. వెరసి అందరూ కలిసి అత్యున్నత విద్యాసంస్థ మర్యాదను దిగజార్చే ప్రయత్నం చేశారంటూ విద్యావర్గాలు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నాయి. చివరికి తమ అడుపాజ్ఞలో పనిచేసే సిబ్బందే ఏకంగా రిజిస్ట్రార్ చాంబర్, వీసీ చాంబర్ గదులకు తాళం వేసే వరకు వెళ్లడం ఎంత పరువు తక్కువో.. తమ స్థాయిని ఎంత దిగజార్చుకున్నారో ఆ కుర్చీల్లో కూర్చుండే అధికారుల విజ్ఞతకే తెలియాలి.



ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి పంపిన లేఖను చూపిస్తున్న యాదగిరి, పక్కన కనకయ్య

కిస్సా కుర్సీకా..!

- తెలంగాణ వర్సిటీ పరువును బజారుకీడ్చారు..
- రిజిస్ట్రార్ పదవి కోసం యాదగిరి, కనకయ్యల వాదులాట
- బయటి వ్యక్తులను వర్సిటీలోకి తీసుకొచ్చి గొడవ చేయించే సంస్కృతికి బీజం
- ఈసీ తీర్మానాల అమలులో అడ్డంకులు సృష్టిస్తున్న వైనం



వీసీ చాంబర్‌కు వేసిన తాళం



రిజిస్ట్రార్ చాంబర్‌కు వేసిన తాళం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాజకీయ పార్టీల్లో గల్లీ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పదవుల కోసం కొట్లాటలు నడుస్తుండడం సర్వసాధారణం. కానీ తెలంగాణ వర్సిటలో మాత్రం అంతకుమించి అన్నట్లుగా రిజిస్ట్రార్ కుర్చీ విషయంలో ఎడతెగని రగడ కొనసాగుతుండడం విస్తుగొలుపుతోంది. వీసీ రవీందర్ గుప్తా వ్యవహార శైలి, అక్రమ నియామకాల నేపథ్యంలోనే రిజిస్ట్రార్ పదవి విషయంలో నువ్వా నేనా అనేవిధంగా పంచాయితీ నెలకొన్నట్లు వర్సిటీ వర్గాలు, విద్యార్థి సంఘాలు అంటున్నాయి. రెండేళ్ల కాలంలో ఏకంగా ఆరుగురు రిజిస్ట్రార్లు పదిసార్లు కుర్చీలు మార్చుకున్న పరిస్థితి నెలకొంది. మళ్లీ తాజాగా సోమవారం వర్సిటీలో రిజిస్ట్రార్ కుర్చీ విషయమై ఆ చాంబర్‌లో మూడు గంటల పాటు లొల్లి నడిచింది. పాలకమండలి తీర్మానం మేరకు రిజిస్ట్రార్‌గా నియమితులైన యాదగిరి కుర్చీలో కూర్చున్నారు. ఇదే సమయంలో కనకయ్య వచ్చి తనను వీసీ రిజిస్ట్రార్‌గా నియమించారని, తనకే కుర్చీలో కూర్చునే అధికారం ఉందని వాదించారు. పాలకమండలి, ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వండతోనే రిజిస్ట్రార్ బాధ్యతలు తీసుకున్నట్లు యాదగిరి తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాలన్నీ అక్కడకు వచ్చి రిజిస్ట్రార్ యాదగిరికి మద్దతుగా నిలిచాయి. బయట నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు, ఒక్క విద్యార్థి సంఘం మాత్రం కనకయ్యకు మద్దతుగా నిలిచాయి. చివరకు అందరూ కలిసి ఒక తీర్మానానికి వచ్చారు. రిజిస్ట్రార్ ఎవరో తేలేవరకు వీసీ, రిజిస్ట్రార్ చాంబర్లకు తాళాలు వేయాలని నిర్ణయించారు. మొత్తానికి రాజకీయ పార్టీల్లో గల్లీ స్థాయిలో పదవి కోసం కొట్లాడుకున్న మాదిరిగా చాలాసేపు వ్యవహారం కొనసాగడం విశేషం. బయటి వ్యక్తులను తీసుకొచ్చి గొడవ చేయించే విధంగా సంస్కృతికి బీజం వేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో రిజిస్ట్రార్ కుర్చీ విషయమై చిల్లర పంచాయితీ నెలకొనడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

అక్రమాల పుట్ట పగులుతుందనేనా..?

వర్సిటీకి అత్యున్నతమైన పాలకమండలి తీర్మానాలను అమలుచేసే విషయంలో వీసీ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తుండడం గమనార్హం. ఇప్పటికే కనకయ్యతో కలిసి వీసీ అక్రమ నియామకాలు చేయడం, విచ్చలవిడిగా సుమారు రూ. 40కోట్ల మేర అధికారిక అనుమతి లేకుండా ఖర్చులు చేయడం, అడ్వాన్సులు చెల్లించడం తదితర వ్యవహారాలపై విచారణకు ఇప్పటికే ఈసీ ఐదుగురు సభ్యుల కమిటీ నియమించింది. ఈ కమిటీ ఒక్కరోజు విచారణ చేస్తేనే రూ. కోటి మేర అక్రమ చెల్లింపులు వెలుగుచూశాయి. కమిటీ విచారణ నేపథ్యంలో 55వ పాలకమండలి తీర్మానాలపై వీసీ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. మళ్లీ తర్వాత 56, 57 పాలకమండలి తీర్మానాలపైనా స్టే తెచ్చుకునేందుకు వీసీ ప్రయత్నాలు చేస్తున్నారు. వీసీని ఎవరు వెనక ఉండి నడిపిస్తున్నారో కానీ, ఉన్నత విద్యాశాఖ కమీషనర్ నవీన్ మిట్టల్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తుండడం గమనార్హం. అక్రమాలు బయట పడతాయనే వీసీ ఇష్టం వచ్చినట్లు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ లేకుండానే కనకయ్య యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ప్రమోషన్ పొందాడని, అదేవిధంగా సర్వీసు పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లాడనే విషయమై విచారణకు ఈసీ తీర్మానం చేసింది. అదేవిధంగా పీహెచ్‌డీ ప్రవేశాలపై సైతం కనకయ్య అక్రమాలు చేసినట్లు ఈసీ నిర్ణయించింది. ఈ వ్యవహారాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఈసీ నిర్ణయం తీసుకుంది. ఇక వీసీ రవీందర్‌గుప్తా, కనకయ్య చేసిన అక్రమ నియామకాలపైనా, విచ్చలవిడిగా చేసిన ఖర్చులపైనా విచారణ చేస్తే అన్నీ బయటకొస్తాయనే వీరిద్దరూ కలిసి రిజిస్ట్రార్‌గా మరొకరు ఉండేందుకు అంగీకరించకుండా ఇష్టం వచ్చినట్లు చేస్తున్నట్లు ఈసీ సభ్యులు తెలిపారు. ఇక వర్సిటీ ల్యాప్‌టాప్‌ను రెండేళ్లుగా తనవద్దనే ఉంచుకున్న కనకయ్య ఇప్పటివరకు అప్పగించకపోవడం విశేషం. మొత్తం మీద అక్రమ వ్యవహారాలను పాలకమండలి సభ్యులు బట్టబయలు చేయకుండా చేసేందుకే ఈ తెగింపు చర్యలకు వీసీ రవీందర్, కనకయ్య పాల్పడుతున్నట్లు వర్సిటీలో తీవ్రచర్చ జరుగుతోంది.



దేవాలయాలను పరిరక్షించాలి

నిజామాబాద్‌సిటీ: జిల్లాలో హిందూ దేవాలయాలను పరిరక్షించాలని కోరుతూ దేవాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం నగరంలో భారీ కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ దేవాలయల పరిరక్షణ సమితి పటేల్ ప్రసాద్ మాట్లాడుతూ.. శంభునిగుడి ఆలయం చుట్టూ ఇతర దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కంఠేశ్వర్ ఆలయంలో అన్యమతస్తుల దుకాణాలను తొలగించాలన్నారు. కబ్జాకు గురైన పెద్ద రాంమందిర్ భూములు కాపాడాలన్నారు.

తెలంగాణ ప్రాశస్త్యం చాటాలి

- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

సుభాష్‌నగర్: తెలంగాణ ప్రాశస్త్యం చాటిచెప్పేలా రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులతో చీఫ్ సెక్రెటరీ సమీక్షించారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కోసం చేపడుతున్న ఏర్పాట్లు, సన్నద్ధత గురించి జిల్లాల వారీగా పాలనాధికారులను అడిగి తెలుసుకున్నారు. తొమ్మిదేళ్లలో అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై శాఖల వారీగా ఫ్లెక్సీలు, కరపత్రాల ద్వారా తెలియజేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిల్లో నిర్దేశించిన కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని తెలిపారు. జూన్ 2న అమరవీరుల స్థూపాల వద్ద తెలంగాణ అమరులకు నివాళులర్పించాలని, ఉద యం 9 గంటలకు అవతరణ దినోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. 3న రైతు దినోత్సవం సందర్భంగా రైతు వేదికలను అలంకరించాలని, ఎడ్లబండ్ల ప్రదర్శనల ద్వారా పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. విద్యుత్ దినోత్సవం, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, సురక్షా దినోత్సవం, సాగునీటి దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ, గిరిజనోత్సవం, తెలంగాణ రన్ తదితర కార్యక్రమాలను సైతం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే జిల్లా అధికారులతో సమావేశమై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సైతం దిశానిర్దేశం చేశారని సీఎస్ దృష్టికి తెచ్చారు. దశాబ్ది ఉత్సవాల ను పెద్దఎత్తున నిర్వహించేలా కృషి చేస్తున్నామన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చిత్రమిశ్రా, చంద్రశేఖర్, ట్రెయినీ ఐఏఎస్ కిరణ్మయి, అదనపు సీపీ గిరిరాజా, జెడ్పీ సీఈవో గోవింద్, సీపీవో బాబురావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

క్రమబద్ధీకరణకు అడుగులు..

- సాకారం కానున్న వీఆర్‌ఏల కల
- గౌరవ వేతనానికి బదులు పేస్కేల్ వర్తింపజేస్తూ మంత్రివర్గం నిర్ణయం
- అపాయింట్‌మెంట్, వయస్సు, విద్యార్హతల ఆధారంగా వివరాల సేకరణ
- సీసీఎల్‌ఏకు నివేదించిన అధికారులు
- జిల్లాలో 1642 మంది వీఆర్‌ఏలు



మోర్తాడ్‌లో ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

సుభాష్‌నగర్/మోర్తాడ్: వీఆర్‌ఏ ఉద్యోగాల క్రమబద్ధీకరణకు అడుగులు పడుతున్నాయి. వీరిని క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంతో వారి కల సాకారం కానుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం సూచించిన 46 ప్రశ్నలతో కూడిన ఫార్మాట్‌లో తహసీల్దార్ల ద్వారా వీఆర్‌ఏల వివరాలు సేకరిస్తున్నారు. అపాయింట్‌మెంట్, వయస్సు, విద్యార్హతల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజిస్తున్నారు. మొత్తం 1,642 మంది వీఆర్‌ఏలు విధుల్లో ఉన్నారు. కాగా విద్యార్హతలు, వయస్సు ఆధారంగా ఇరిగేషన్, మున్సిపాలిటీ, విద్యాశాఖ, రెవెన్యూశాఖ, మిషన్ భగీరథ, జిల్లా పరిషత్, మెడికల్ కాలేజీల్లో సర్దుబాటు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

వివరాల సేకరణ తర్వాతే..

వీఆర్‌ఏల సమగ్ర సమాచారం ప్రభుత్వానికి నివేదించిన తర్వాతే క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు జారీకానున్నాయి. జిల్లాలో 1,642 మంది వరకు వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు. వీరిలో ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ ద్వారా 130 మంది వరకు నియమితులయ్యారు. మిగతా 1,512 మంది వరకు వారసత్వంగా వచ్చిన వారు ఉన్నారు. కొందరు వయోపరిమితితో సంబంధం లేకుండా పనిచేస్తుండగా, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారి స్థానంలో కుటుంబసభ్యులు వీఆర్‌ఏగా కొనసాగుతున్నారు. వీరిలో 350 మంది వరకు డిగ్రీ, ఆపైన, 220 వరకు ఇంటర్, 500 మంది వరకు పదోతరగతి చదువుకున్న వారు ఉన్నారు. వీరందరికీ పేస్కేల్ వర్తించనుంది.

జిల్లాలో రెవెన్యూ గ్రామాలు	452
మొత్తం వీఆర్‌ఏలు	1642
టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకం	130
వారసత్వంగా నియామకం	1512

80 రోజుల పాటు సమ్మె..

సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టం తెస్తూ, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు చేసి, వీఆర్‌ఏలందరికీ పేస్కేల్, పదోన్నతులు, వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని అసెంబ్లీలో 2020 సెప్టెంబర్ 9న ప్రకటించారు. సీఎం హామీని అమలు చేయాలని గతేడాది 80 రోజులపాటు సమ్మెకు దిగారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సూచనల మేరకు సమ్మె విరమింపజేశారు. తాజాగా ఇటీవల కేబినెట్‌లో వీఆర్‌ఏలకు పేస్కేల్, పదోన్నతులు, వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని నిర్ణయించారు.

మూడు కేటగిరీలుగా..

వీఆర్‌ఏలకు పేస్కేల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న వారి వివరాలు తహసీల్దార్ల ద్వారా సేకరించారు. మొదటి ఫార్మాట్‌లో పేరు, 2023 మే 19 నాటికి వయస్సు, విద్యార్హత, కులం, నియామకమైన విధానం, తదితర అంశాలతో సేకరిస్తున్నారు. 1,642 మంది వివరాలు సేకరించి, సీసీఎల్‌ఏకు నివేదించారు. ప్రభుత్వ వీఆర్‌ఏ పేస్కేల్ జీవోను తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ మొత్తం జూన్ 20లోపు పూర్తి కానుందని తెలిసింది.

వివరాలను పంపించాం

వీఆర్‌ఏల వివరాలను ఉన్నతాధికారు లు పంపించాలని ఆదేశిస్తే పంపించాం. ఏ గ్రామంలో ఎంత మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు, వా రి విద్యార్హతలు ఏమిటి, పదవీ విరమణకు ఇంకా ఎంత సమ యం ఉంది ఇలా ఎన్నో వివ రాలను ఉన్నతాధికారులకు ని వేదించాం. ప్రభుత్వం మార్గద ర్శకాలను జారీ చేసిన తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

– బింగి జనార్దన్, తహసీల్దార్ ఏర్గట్ల

కాల్పుల కలకలం..

- ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను పట్టుకునేందుకు యత్నం
- రెండు రౌండ్ల కాల్పులు జరిపిన ధర్పల్లి ఎస్సై
- ఇందల్వాయి టోల్‌గేటు వద్ద ఘటన
- నిందితులు జార్ఖండ్, రాజస్థాన్‌కు చెందిన వారిగా పోలీసుల గుర్తింపు

ఖలీల్‌వాడి/ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలోని టోల్‌ప్లాజా వద్ద దొంగలపై పోలీసులు కాల్పుల జరిపిన ఘటన కలకలం రేపుతోంది. జిల్లాలో వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు తరుచూ చోరీలకు గురవుతుండడంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జిల్లాలోని నిజామాబాద్ పోలీస్ డివిజన్ పరిధిలోని ధర్పల్లి, ఇందల్వాయి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో ధర్పల్లి, ఇందల్వాయి పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను పట్టుకునేందుకు కొంతకాలంగా దొంగలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలోని జాతీయరహదారులకు దగ్గరగా, వ్యవసాయక్షేత్రంలోకి ఎవరూ రాని ప్రాంతాలను దొంగలు ఎంపిక చేసుకుంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేసి ఉదయం పూట జిల్లా నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ముప్కాల్ వద్ద దొంగల ముఠా సంచారం

జార్ఖండ్‌కు చెందిన అంతర్‌రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా జిల్లాలోని ముప్కాల్ ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు కారులో తీసుకొని ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్దకు చేరుకుంటున్నారనే సమాచారం మేరకు ధర్పల్లి, ఇందల్వాయి ఎస్సైలు వంశీచందర్‌రెడ్డి, నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

కారుతో పోలీసులపైకి తీసుకువెళ్లి దొంగల పరారీ

దొంగల ముఠా కారులో ట్రాన్స్‌ఫార్మర్లు తరలిస్తున్న సమాచారం మేరకు సోమవారం ఉదయం 3 గంటలకు ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు రెండు బృందాలుగా తనిఖీలు చేశారు. రాజస్థాన్‌కు చెందిన ఆర్‌జే 29 సీబీ 5874 నంబర్ కారును ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీ చేశారు. కారు జోరు తీసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో డ్రైవర్ కారును ధర్పల్లి ఎస్సై వంశీచందర్‌రెడ్డితో పాటు కానిస్టేబుల్స్‌పైకి తీసుకువెళ్లాడు. వారు తప్పించుకోగా.. పక్కనే ఎస్సైకి చెందిన కారును దొంగల కారు ఢీకొట్టింది. దీంతో ఎస్సై కారు డ్యామేజ్ అయింది. ఎస్సై వంశీచందర్‌రెడ్డి వెంటనే తేరుకొని దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు.



ఘటన జరిగిన స్థలం ఇదే..

పోలీసుల గాలింపు చర్యలు

దొంగల కారును పట్టుకునే క్రమంలో ఎస్సై వంశీచందర్‌రెడ్డి రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో దొంగలు కారులో వేగంగా వెళ్లడంతో పోలీసులు జరిపిన కాల్పుల నుంచి తప్పించుకున్నారు. దొంగలు వెళ్తున్న కారును పట్టుకునేందుకు పోలీసులు ఛేజింగ్ చేసేందుకు ప్రయత్నించగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ వద్ద ముగ్గురు దొంగలు కారును వదిలిపెట్టి పరారీ అయ్యారు. దొంగల ముఠా కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఏడాదిన్నరలో 121 ట్రాన్స్‌ఫార్మర్ కేసులు

జిల్లాలో ఏడాదిన్నర కాలంలో 121 ట్రాన్స్‌ఫార్మర్ కేసులు నమోదు అయ్యాయి. 2022లో 60 కేసులు నమోదు కాగా 2023లో జనవరి నుంచి మే 29 మేరకు జిల్లాలో 61 కేసులు నమోదయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌కాయిల్స్ ఎక్కువగా ఉండడంతో వీటిని దొంగలు పగులగొట్టి వాటిని మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తారు. రైతుల పంట పొలాల వద్ద ఉండే ట్రాన్స్‌ఫార్మర్లనే దొంగలు టార్గెట్ చేస్తారు. 16 కేవీ, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌కాయిల్స్ 7 నుంచి 8 కిలోల వరకు ఉంటుంది. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 23 కిలోల కాపర్ లభిస్తుంది. దీంతో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్‌ను నిలిపివేసి వాటిని రాడ్లతో పగుల గొట్టి అందులో నుంచి కాపర్ తీసుకొని వెళ్లి విక్రయిస్తారు. జిల్లాలో రాజస్థాన్, జార్ఖండ్ ముఠాలు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ కాయిల్స్‌ను తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఆరు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

ముప్కాల్ మండలం వేంపల్లిలో..

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో వ్యవసాయ క్షేత్రాల్లోని ఆరు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ కాయిల్స్‌ను ఆదివారం అర్ధరాత్రి తర్వాత దుండగులు ఎత్తుకెళ్లారు. ప్రధానంగా జాతీయ రహదారి 44 నుంచి రెంజర్ల వరకు గల తారు రోడ్డుకు ఆనుకుని ఉన్న వ్యవసాయ క్షేత్రాల నుంచే విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. దీంతో సోమవారం ఉదయం ట్రాన్స్‌కో ఏఈ రవి పోలీసులకు పిర్యాదు చేయడంతో ఏఎస్సై సురేష్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత రెండు నెలల వ్యవధిలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చోరీ ఘటనలు నాలుగు సంభవించాయి.

ఇందల్వాయి వద్ద పోలీసుల నుంచి తప్పించుకున్న ముఠా పనేనా..!

జాతీయ రహదారి–44పై గల టోల్‌ప్లాజా వద్ద పోలీసుల కళ్లు గప్పి పరారైన రాజస్థాన్ ముఠానే వేంపల్లి శివారు అర్ధరాత్రి చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దుండగులను పట్టుకుంటే ఇన్నాళ్లుగా జరుగుతున్న చోరీల గుట్టురట్టయ్యే అవకాశం ఉంది.



వేంపల్లిలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ, ఏఎస్సై, రైతులు

నిధి ఆప్కే నికట్‌ విజయవంతం


మాట్లాడుతున్న అధికారి శ్రావణ్‌కుమార్‌

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ పీఎఫ్‌ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్‌ 2.0 కార్యక్రమం సోమవారం నిజామాబాద్‌ రూరల్‌ మండలం మల్లారం దేశాయి బీడీ కంపెనీలో జరిగింది. పీఎఫ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి శ్రావణ్‌కుమార్‌ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈపీఎఫ్‌వో కింద కవర్‌ చేయబడిన యజమానులు, పీఎఫ్‌ చందాదారులు, పెన్షనర్లు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి సమస్యలను, ఫిర్యాదులను సేకరించి తక్షణమే పరిష్కరించారు. ప్రతినెలా 27న నిధి ఆప్కే నికట్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

‘ఓపెన్‌’ అక్రమాలపై రేపు ఆర్డీవో విచారణ

కామారెడ్డిటౌన్‌: కామారెడ్డి జిల్లాలో గత జరిగిన ఇంటర్‌, టెన్త్‌ ఓపెన్‌ అక్రమాలపై కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌ ఈ నెల 31న విచారణ జరపనున్నారు. ఈ అక్రమాలపై విచారణ కమిటీ సభ్యులుగా ఎల్లారెడ్డి ఎంఈవో వెంకటేశం, సదాశివనగర్‌ ఎంఈవో యోసఫ్‌ను నియమించారు. వారు విచారణ, సేకరించిన సాక్ష్యాల నివేదికను 31న ఆర్డీవోకు సమర్పించాల్సి ఉంటుంది. విచారణ తేదిన వ్యక్తిగతంగా విచారణ కమిటీ సభ్యులతో పాటు ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు, ఆరోపణలు ఎదుర్కొన్న పరీక్షల నిర్వహణ అధికారులు హాజరుకావాలని ఆర్డీవో తెలిపారు.













పెరుగుతున్న పసుపు ధర

- క్వింటాలుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు హెచ్చింపు
- సీజను ముగిసిన తర్వాత పెరగడంతో రైతులకు దక్కని ప్రయోజనం


నిజామాబాద్‌ మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన పసుపు కొమ్ములు

మోర్తాడ్‌: పసుపు నిల్వలు రైతుల వద్ద తగ్గిపోయిన తర్వాత ధర పెరుగుతుండటంతో నిల్వ చేసుకున్న స్టాకిస్టులు, వ్యాపారులకే ప్రయోజనం కలుగనుందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. పసుపు సాగు విస్తీర్ణం తగ్గి, దిగుబడిపై ప్రభావం చూపినా సీజనులో పంటకు ధర పెరుగకపోవడంతో రైతులకు లాభాలు దక్కలేవు. ఒక క్వింటాలు పసుపునకు మొదట్లో రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ధర పలికింది. సీజను ముగిసే దశలోనే రూ.6వేల వరకు ధర లభించింది. ఇప్పుడు మాత్రం ఏకంగా క్వింటాలుకు రూ.1,500 వరకు ధర పెరుగడంతో రైతులు నిట్టూర్పువిడుస్తుండగా, పసుపు నిలువ చేసుకున్నవారు సంబరపడుతున్నారు. సాగు విస్తీర్ణం తగ్గడం, అతివృష్టితో దిగుబడి సన్నగిల్లడంతో మార్కెట్‌లో పసుపుకు కొరతనే ఏర్పడింది. ఈ నేపథ్యంలో క్వింటాలు పసుపునకు రూ.10వేల నుంచి రూ.12 వేల వరకు ధర దక్కుతుందని రైతులు ఆశించారు. కమోడిటీ ప్రభావం, వ్యాపారుల సిండికేట్‌తో పసుపు ధరలో వృద్ధి కనిపించలేదు. రైతుల వద్ద పసుపు నిలువలు తగ్గిపోయిన తరువాత ధర జంప్‌ కావడంతొ కొందరికే ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని వెల్లడైతుంది. గతంలోను సీజను ముగిసిన తరువాతనే పసుపుకు ధర పెరిగింది.

అవగాహన లోపం

రైతులు పసుపును తక్కువ ధరకు విక్రయించకుండా నిలువ చేసుకుని ధర పెరిగినప్పుడే అమ్ముకునే విధంగా మార్కెట్‌ ఇంటర్వెన్షన్‌ పథకం(ఎంఐఎస్‌)ను అమలులోకి తీసుకవచ్చినా రైతులకు అవగాహన లేక ఈ పథకంను సద్వినియోగం చేసుకోలేకపోయారు. మార్కెట్‌ ఇంటర్వెన్షన్‌ పథకానికి నిధులను మార్కెటింగ్‌ శాఖ సమకూరుస్తుందని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఎక్కడ కూడా ఎంఐఎస్‌ను రైతులు వినియోగించుకోలేదు. మార్కెటింగ్‌ శాఖ గోదాంలు లేదా కోల్డ్‌స్టోరేజ్‌లలో పసుపును నిలువ చేసుకుని దీని విలువపై తక్కువ వడ్డీకి రుణం పొందడానికే ఎంఐఎస్‌ను అమలులోకి తీసుకవచ్చారు. రైతులకు ఎంఐఎస్‌ పథకంపై సరైన అవగాహన లేకపోవడం శాపంగా మారింది. ఏదిఏమైనప్పటికి పసుపు పంటకు సీజను ముగిసిన తరువాత ధర పెరగడం వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం లేదని చెప్పవచ్చు.

లారీపై నుంచి పడి డ్రైవర్‌ మృతి


వెంకటేశ్‌ మృతదేహం

లింగంపేట: మండలంలోని నల్లమడుగు పెద్ద తండా కొనుగోలు కేంద్రం వద్ద లారీపై నుంచి పడి డ్రైవర్‌ వెంకటేశ్‌ (42) మృతి చెందినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. సోమవారం సాయంత్రం నల్లమడుగు పెద్ద తండా కొనుగోలు కేంద్రంలో లారీలో వడ్ల బస్తాలు లోడ్‌ చేశారు. ఈ క్రమంలో డ్రైవర్‌ లారీపైకి ఎక్కి ధాన్యం బస్తాలకు తాడు సరిగా కట్టారా లేదా అని చూస్తుండగా ప్రమాదవశాత్తు జారీ పడి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీపై నుంచి కింద పడడంతో తలకు బలమైన గాయాలు కావడంతో మృతి చెందినట్లు తెలిపారు. లారీతో పాటు డ్రైవర్‌ కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందినదిగా గుర్తించారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: ఆర్మూర్‌లోని రాజారాంనగర్‌లో పేకాడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ వెంకటేష్‌ తెలిపారు. వారి వద్ద 14 సెల్‌ఫోన్‌లు, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు


కలెక్టరేట్‌ బయట బాక్సులో ఫిర్యాదులు వేస్తున్న ప్రజలు

సుభాష్‌నగర్‌: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై సీఎస్‌ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్‌ నేపథ్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గమనించని ఫిర్యాదు దారులు కొందరు కలెక్టరేట్‌కు రావడంతో వారి కోసం గేట్‌ వద్ద ప్రత్యేకంగా ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేశారు. బాధితులు వినతిపత్రాలను పెట్టెలో వేసి, పేర్లు నమోదు చేయించుకున్నారు.

హుస్సాముద్దీన్‌ను అభినందించిన మంత్రి



నిజామాబాద్‌నాగారం: వరల్డ్‌ బాక్సింగ్‌ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన నిజామాబాద్‌ నగరానికి చెందిన హుస్సాముద్దీన్‌ను సోమవారం హైదరాబాద్‌ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

టాస్క్‌ఫోర్స్‌ పోలీసులకు డివిజన్‌ల కేటాయింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలోని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులకు డివిజన్‌లు కేటాయించారు. ఇన్‌చార్జీ సీపీ ప్రవీణ్‌కుమార్‌ ఆదేశాల మేరకు ఇద్దరు టాస్క్‌ఫోర్స్‌ సీఐలతోపాటు సిబ్బందిని కమిషనరేట్‌ పరిధిలోని మూడు డివిజన్‌లకు కేటాయించారు. సీఐ శ్రీధర్‌ను నిజామాబాద్‌ నగరానికి, సీఐ వెంకటేష్‌ను ఆర్మూర్‌, బోధన్‌ ప్రాంతాలకు కేటాయించారు. జిల్లాలో పీడీఎస్‌ బియ్యం, గంజాయి, అక్రమ మొరం, ఇసుక దందాలు కొనసాగుతుండటంతో ఇన్‌చార్జీ సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్‌ సిబ్బందిని డివిజన్‌ల వారీగా కేటాయించినట్లు సమాచారం.

సివిల్స్‌ ర్యాంకర్‌ను అభినందించిన కలెక్టర్‌


మహేష్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌: సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి అఖిల భారత సర్వీసులకు ఎంపికైన బోధన్‌ పట్టణానికి చెందిన కంఠం మహేష్‌కుమార్‌ను కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం తన ఛాంబర్‌లో అభినందించారు. మహేష్‌కు మిఠాయి తినిపించి, జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయిని అధిష్టించాలని ఆకాంక్షించారు. డీఎంహెచ్‌వో సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్‌ ఆధ్వర్యంలో..

నగరంలోని కలెక్టరేట్‌లోగల టీఎన్‌జీవో కార్యాలయంలో సోమవారం మహేష్‌కుమార్‌, ఆయన కుటుంబసభ్యులను ఎంప్లాయీస్‌ జేఏసీ చైర్మన్‌, టీఎన్‌జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్‌ ఆధ్వర్యంలో సన్మానించారు. నేతికుంట శేఖర్‌, సంగం అమృత్‌కుమార్‌, చిట్టి నారాయణరెడ్డి, ఆకుల ప్రసాద్‌ పాల్గొన్నారు.

నీళ్లు పడ్డాయని ఘర్షణ

నందిపేట్‌: నందిపేట మండల కేంద్రంలో మంగళవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. డొంకేశ్వర్‌ మండలంలోని నికాల్‌పూర్‌ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు నందిపేటలోని ఒక టి ఫిన్‌ సెంటర్‌లో టిఫిన్‌ చేసిన అనంతరం చేయి కడుక్కునే సందర్భంలో పక్కన ఉన్న ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిపై నీళ్లు పడ్డాయి. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న రాజకీ య పార్టీకి చెందిన నాయకుడి వర్గం వారు హోటల్‌ వద్దకు వచ్చి సదరు ఇద్దరు వ్యక్తులను చితకబాదారు. దీంతో వారిద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులను వివరణ అడగ్గా ఇరువర్గాల వారు ప్రాథమిక సమాచారం ఇచ్చారు కానీ రాతపూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తాడ్వాయి: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న మండలంలోని దేవాయిపల్లి గ్రామానికి చెందిన ఏనుగు జైపాల్‌రెడ్డి పొలం వద్ద ఉన్న రోటవేటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. కృష్ణాజీవాడికి చెందిన కుమ్మరి శ్యాం రోటవేటర్‌ను కూడా చోరీ చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాగే పలు ఠాణాల పరిధిలో చోరీలు జరగడంతో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒక స్పెషల్‌ టీంను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. సీసీ టీవీలు, సాంకేతిక ఆధారాలతో కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లికి చెందిన బయమొల్ల స్వామి, తాడ్వాయి మండలం సోమారం గ్రామా నికి చెందిన భోదసు సాయిలును నిందితులుగా గుర్తించామన్నారు. వీరిద్దరు గతంలో సోమారంలో జరిగిన హత్యకేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. దొంగలించిన పనిముట్లను తమవేనని నమ్మిచ్చి పెద్దమల్లారెడ్డి చెందిన మంగళి బాబుకు విక్రయించారని చెప్పారు. వారి నుంచి రోటవేటర్లు, నాగళ్లు, రూ.రెండు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సీఐ రామన్‌, ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు రమేష్‌, రాజునాయక్‌, గంగారాం ఉన్నారు.

వేగంగా ఆర్‌అండ్‌బీ శాఖ పునర్విభజన

- జూన్‌ 10 నుంచి అందుబాటులోకి కార్యాలయాలు



ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సర్కిల్‌ కార్యాలయం

నిజామాబాద్‌నాగారం : జిల్లాలోని ఆర్‌అండ్‌బీ పునర్విభజన ప్రక్రియ వేగంగా జరుగుతోంది. జిల్లాలో కొత్త సబ్‌ డివిజన్లతో పాటు ఎలక్ట్రికల్‌ డివిజన్‌, నేషనల్‌ హైవే, బిల్డింగ్‌ సెక్షన్‌, బిల్డింగ్‌ సబ్‌ డివిజన్‌ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. కార్యాలయాల కోసం భవనాలు, గదులు సిద్ధం చేస్తున్నారు. జూన్‌ 10 నుంచి అధికారికంగా కార్యాలయాలు అందుబాటులోకి రానున్నాయి. మంత్రి ప్రశాంత్‌రెడ్డి వీటిని ప్రారంభించనున్నారు.

పునర్విభజన ఇలా..

- నిజామాబాద్‌ జిల్లా ఆర్‌అండ్‌బీ సర్కిల్‌ పరిధిలో కొత్తగా సబ్‌డివిజన్‌లు, ఎలక్ట్రీకల్‌ కార్యాలయం, ఇతర సెక్షన్‌లు అన్ని ఏర్పాటు కానున్నాయి.
- వేల్పూర్‌లో కొత్తగా సబ్‌ డివిజన్‌ ఏర్పాటు కానుంది. ప్రస్తుతానికి భీమ్‌గల్‌ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఏఈ ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.
- బిల్డింగ్‌ సబ్‌డివిజన్‌, బిల్డింగ్‌ సెక్షన్‌ కార్యాలయాలు జిల్లా కేంద్రంలోని డిప్యూటీ ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. డిప్యూటీ ఈఈ, ఏఈలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.
- నేషనల్‌ హైవే సర్కిల్‌ కార్యాలయం కొత్తగా ఏర్పాటు కానుంది. ఇందులో మొత్తం 11మంది అధికారులను నియమించనున్నారు. ప్రస్తుతం డిప్యూటీ కార్యాలయంలో గదులను సిద్ధంగా ఉంచారు.
- ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ కార్యాలయాన్ని పక్కనే ఉన్న మరో భవనంలోకి మార్చారు.
- ఎలక్ట్రీకల్‌ డివిజన్‌ కార్యాలయం నగరంలోని ఎస్‌ఈ ఆఫీస్‌లో ఏర్పాటు కానుంది. ఈఈ పోస్టుతోపాటు, డిప్యూటీ ఈఈ, ఏఈ పోస్టులు రానున్నాయి.

క్రైం కార్నర్‌

కేదార్‌నాథ్‌ యాత్రకు వెళ్తూ యువకుడి మృతి


వాసు (ఫైల్‌)

ఆర్మూర్‌టౌన్‌: కేదార్‌నాథ్‌ యాత్రకు బయలుదేరిన పెర్కిట్‌కు చెందిన దోండి వాసు(24) ఉత్తర్‌ప్రదేశ్‌లోని లలితపూర్‌ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్‌ వాహనాన్ని అద్దెకు తీసుకొని హైదరాబాద్‌ నుంచి శనివారం మధ్యాహ్నం వాసు తన ఇద్దరు మిత్రులతో కలిసి కేదార్‌నాథ్‌ యాత్రకు బయలు దేరాడు. ఆదివారం తెల్లవారుజామున వీరి వాహనం డివైడర్‌ను ఢీకొని, ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో వాసు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు మిత్రులు స్వల్ప గాయలతో బయటపడ్డారు. వాసు హైదరాబాద్‌లోని ఓ క్యాబ్‌ కంపెనీలో పనిచేస్తున్నాడు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు

వర్ని/బోధన్‌: హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ బోధన్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి దేవన్‌ అజయ్‌కుమార్‌ తీర్పునిచ్చారు. అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ సమ్మయ్య, వర్ని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. వర్ని మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన త్యాపల సాయిబాబా గతేడాది ఏప్రిల్‌లో అదే గ్రామానికి చెందిన తన పెద్దనాన్న త్యాపాల చిన్నారెడ్డి, ఆయన భార్య లలిత, కూతురు అక్షరపై దాడి చేశాడు. వర్ని పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా సెషన్స్‌ జడ్జి సాయిబాబాకు ఏడాది జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధించారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్‌

మద్నూర్‌: తనకు వారసత్వంగా రావాల్సిన భూమి దక్కదనే కోపంతో మండలంలోని సోనాలలో తమ్ముడిని హత్య చేసిన రాజు పాటిల్‌ను సోమవానం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. సోనాలకు చెందిన విజయ్‌ పాటిల్‌ను ఆదివారం వేకువజామున అతడి అన్న రాజు పాటిల్‌ కత్తితో పొడిచి దారుణ హత్య చేయడంతో విచారణ జరిపామన్నారు. వారసత్వంగా రాజు పాటిల్‌కు రావాల్సిన భూమిని విజయ్‌ పాటిల్‌ తనకు రానివ్వకుండా ఒక్కడే అనుభవిస్తూ ఖర్చు చేస్తున్నాడనే కోపంతో హత్య చేసినట్లు తేలిందని ఎస్సై పేర్కొన్నారు.

చిన్నారిపై అత్యాచార యత్నం

బోధన్‌: బోధన్‌ పట్టణానికి చెందిన ఐదేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. ఈ నెల 26న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణంలోని వీధుల్లో గాజులు అమ్ముకునే ఖాజామియా (40) చిన్నారికి మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్మీ గణపతి ఆలయంలో చోరీ



మోపాల్‌: నగర శి వారులోని బోర్గాం (పి)లోగల శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు, ఆ లయ నిర్వాహకు లు తెలిపిన వివ రాల ప్రకారం.. ఆలయంలోని ప్రధాన హుండీని దుండగులు ఎత్తుకెళ్లి స్థానికంగా ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఎన్‌క్లేవ్‌ వెంచర్‌లో ధ్వంసం చేశారు. అందులో మూడు నెలలుగా భక్తులు సమర్పించిన నగదు సుమారు రూ.లక్ష వరకు ఎత్తుకెళ్లారు. హుండీని అక్కడే వదిలేశారు. పోలీసులు, క్లూస్‌టీం అక్కడికి చేరుకుని వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. ఆలయ వ్యవస్థాప క అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌ శర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


బాగయ్య

ఖలీల్‌వాడి: నగరంలోని నా లుగో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని వినాయక్‌ నగర్‌కు చెందిన బాగయ్య(75) అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. బాగయ్య ఈ నెల 28న తన కూతురి ఇంటి నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. నిజామాబాద్‌ రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా దొరకపోవడంతో బాగయ్య కుమారుడు దత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోధన్‌కు చెందిన ఒకరు..


సంతోష్‌

బోధన్‌: బోధన్‌లోని పాన్‌గల్లీ ప్రాంతానికి చెందిన కందికట్ల సంతోష్‌ (39) అదృశ్యమైనట్లు టౌన్‌ సీఐ ప్రేమ్‌ కుమార్‌ సోమవారం తెలిపారు. ఈ నెల 26న ఉదయం 10.30 గంటల సమయంలో ఇంట్లో భార్యతో గొడవ పడి సంతోష్‌ బయటకు వెళ్లి పోయాడని, తిరిగి రాలేదన్నారు. సంతోష్‌ తమ్ముడు శ్రీకాంత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కామారెడ్డిలో యువతి..

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని రాజీవ్‌నగర్‌ కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌ఓ నరేష్‌ సోమవారం తెలిపారు. కాలనీకి చెందిన యువతి డిగ్రీ చదువుతోంది. సోమవారం మధ్యా హ్నం తన స్నేహితుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆమె తల్లి సాయంత్రం ప ట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.